
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
31-7-2026 (Friday) MAIN EDITION

## దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్ కన్నుమూత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఫుట్ బాల్ చరిత్రలో అత్యుత్తమ ఇటాలియన్ డిఫెండర్లలో ఒకరైన ఫ్రాంకో బరేసి (66) కన్నుమూశారు. బరేసి గతంలో ఊపిరితిత్తులకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే.. బరేసికి చెందిన క్లబ్ 'ఏసీ మిలన్' స్పందించింది. బరేసి వారసత్వం మరియు ప్రభావం అభిమానుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని క్లబ్ పేర్కొంది.

## రేషన్‌కార్డు ఈకేవైసీ గడువు పెంపు..



**అక్షరటుడే, హైదరాబాద్:** రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేసేందుకు ఉన్న గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో నెల రోజులు పొడిగించింది. ఇవాళే ఆఖరి రోజు కావడంతో, ఈ గడువును ఆగస్టు 31 వరకు పొడిగిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. గడువులోగా ఈకేవైసీ పూర్తి చేయకుంటే నిత్యావసర సరుకులు అందవని అధికారులు స్పష్టం చేస్తుండడంతో కార్డుదారులు కొద్దిగా ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తాజా నిర్ణయం లబ్ధిదారులకు ఎంతో ఊరటనిచ్చింది. అలాగే, ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## డీఎస్సీలో భారీ అక్రమాలు: అంబటి



**అక్షరటుడే, ఏపీ:** ఏపీ డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయని.. సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ నేత అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పోర్ట్స్ కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి జీవో ఇచ్చారని ఆరోపించారు. అభ్యర్థులు పరీక్ష రాయాల్సిన అవసరం లేదని నిబంధనలు మార్చారన్నారు.

## 'సర్' ముసాయిదా ఓటరు జాబితా విడుదల



**అక్షరటుడే, ఏపీ:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 89.22 శాతం మంది (అంటే 3.71 కోట్ల మంది) తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించినట్లు సీఈవో వెల్లడించారు.

## కోల్‌కతాకు తస్లీమా నస్రీన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రముఖ బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కోల్‌కతా నగరంలో అడుగుపెట్టింది. గతంలో ఆమె రాసిన 'ద్విఖండితో' పుస్తకంపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం కావడంతో 2007లో నగరాన్ని వదిలివెళ్లాల్సి వచ్చింది.

## గోదావరిలోకి భారీ వరద..



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో గత రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులు, జలాశయాలు జలకళను సంతరించుకుంటున్నాయి. గోదావరి, కృష్ణా నదుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నదిలో వరద నీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. తాజాగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.



## స్పెయిన్‌లోకి వేలాది మంది వలసదారులు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మొరాకో నుంచి వేలాది మంది వలసదారులు సముద్ర, భూ మార్గాల ద్వారా స్పెయిన్‌లోని సెయుటా ప్రాంతంలోకి ప్రవేశించారు. ఒక్కసారిగా వేల మంది నగరంలోకి తరలివచ్చారు. దీంతో సైనిక బలగాలను మోహరించారు. కాగా.. ఈ పరిణామంపై ఇటలీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీ స్పందిస్తూ.. స్పెయిన్‌లో ఒక్కసారిగా వచ్చిన వలసలు దిగ్భ్రాంతికి గురి చేశాయని పేర్కొంది. తమ దేశ సరిహద్దులను కాపాడుకోవడానికి "అసాధారణ చర్యలు" తీసుకుంటామని పేర్కొంది.

# నాంపల్లి కోర్టుకు కేటీఆర్



**రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'ఫార్ములా ఈ–కార్ రేసు' కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ఎదుట హాజరయ్యారు. ఉదయం కోకాపేటలోని తన నివాసం నుంచి న్యాయస్థానానికి చేరుకున్నారు. కేసులో ఏ-1గా ఉన్న ఆయనకు న్యాయస్థానం రూ. లక్ష పూచీకత్తు, ఇద్దరు వ్యక్తులతో షూరిటీ సమర్పించాలని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 25కి వాయిదా వేసింది.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

**■ ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో హాజరు ■ విచారణ ఆగస్టు 25కి వాయిదా**

ఫార్ములా ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి కోర్టు ఎదుట హాజరయ్యారు. 'ఫార్ములా ఈ ఆర్గనైజేషన్'కు నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లించారనే ఆరోపణలపై ఏసీబీ మార్చి 23న ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేసింది. దీంతో ఆయన కోర్టుకు హాజరయ్యారు.

### ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ఏసీబీ

'ఫార్ములా ఈ-కార్ రేసు' కేసుపై విచారణ చేపట్టిన ఏసీబీ మార్చి 23న 77 పేజీల ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేసింది. ఇందులో 14 మంది సాక్షులను పేర్కొంటూ కేటీఆర్‌తో సహా ఐదుగురిపై అభియోగాలు మోపింది. కోర్టు ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడంతో నిందితులు తొలిసారిగా నేడు కోర్టుకు హాజరయ్యారు. కేబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల అనుమతులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, నిబంధనలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి హెచ్ఎండీఏ ద్వారా సుమారు రూ. 75.88 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారని ఏసీబీ అభియోగం మోపింది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి నష్టం, ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూరిందని, రాబోయే సీజన్లకు గాను ప్రభుత్వంపై రూ. 600 కోట్ల భారం పడేలా ఒప్పందాలు చేశారని పేర్కొంది.


### కేటీఆర్ వాదన ..

ఫార్ములా ఈ-కార్ రేసుకు సంబంధించి వ్యక్తిగత నిర్ణయం కాదని, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి వేదికగా నిలపాలన్న ఉద్దేశ్యంతో అప్పటి ప్రభుత్వం సమిష్టిగా తీసుకున్న విధానపరమైన నిర్ణయమని కేటీఆర్ వాదించారు. అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలను నేరాలుగా చిత్రీకరిస్తూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. కోర్టు విచారణకు ముందు కేటీఆర్ ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ.. "కుట్రపూరితంగా బనాయించిన ఈ తప్పుడు కేసులు ప్రజల తరఫున మేం చేసే పోరాటాన్ని ఆపలేవు. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని పేర్కొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

కోర్టుకు వచ్చిన సమయంలో కేటీఆర్ సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. తనపై కావాలనే కుట్రపూరితంగా ఈ అక్రమ కేసు బనాయించారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు కేసులు ప్రజా సమస్యలపై తాము చేసే పోరాటాలను ఏమాత్రం నిలువరించలేవని, చివరికి నిజమే గెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఏపీలో పర్యటించనున్న ప్రధాని మోదీ



**అక్షరటుడే, ఏపీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు పీఎంవో అధికారిక ప్రకటన విడుదల చేసింది. పర్యటనలో భాగంగా విజయనగరం జిల్లా భోగాపురంలో రూ. 17,900 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ. 5,640 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం'ను ప్రధాని ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. విశాఖపట్నంలో రూ. 460 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏపీ తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రానికి మోదీ శంకుస్థాపన చేస్తారు. రూ. 5,550 కోట్లతో కర్నూలు IV రెన్యూవబుల్ ఎనర్జీ జోన్ విద్యుత్ ప్రసార వ్యవస్థకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కర్నూలు, అనంతపురం సోలార్, విండ్ ఎనర్జీ జోన్లకు సంబంధించిన రూ. 3,550 కోట్లు, రూ. 820 కోట్ల ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు.

## రాహుల్ గాంధీకి సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు..



**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సమయంలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఆయనకు లోక్‌సభ స్పీకర్ సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేశారు. విద్యార్థుల నిరసనలపై జరిగిన చర్చలో రాహుల్ తప్పుడు వ్యాఖ్యలు చేశారని ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నోటీసులపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తీవ్రంగా స్పందించారు. దేశంలోని యువతను భయపెట్టి ఎవరూ సైలెంట్ చేయలేరని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షాలను ఉద్దేశించి.. "మీరిద్దరూ భారతదేశ గతం మాత్రమే.. దేశ భవిష్యత్తు అయిన యువతతో ఎలా ప్రవర్తిస్తున్నారనే విషయంలో అప్రమత్తంగా ఉండాలి" అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## మెటా ఇండియా హెడ్‌పై కేసు నమోదు

**అక్షరటుడే, హైదరాబాద్ :** ఇటీవల జంతర్ మంతర్ వద్ద జరిగిన బొద్దింక జనతా పార్టీ నిరసనల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకున్న కంటెంట్‌పై మెటా ఇండియా హెడ్‌తో పాటు ఇతర ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలపై కేసులు నమోదయ్యాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ప్రధానమంత్రికి సంబంధించిన మార్ఫింగ్ చేసిన, అభ్యంతరకరమైన వీడియోలు, చిత్రాలను ప్రచారం చేశారన్న ఆరోపణలపై మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.




## పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత.. అంత్యక్రియలు పూర్తి



**అక్షరటుడే, హైదరాబాద్:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గత కొద్ది రోజులుగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆయనను యశోద ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగినప్పటికీ ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆదివారం నుంచి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. అయితే వైద్యుల ప్రయత్నాలు ఫలించకపోవడంతో తుదిశ్వాస విడిచారు. కాగా.. ఆయన అంతిమ యాత్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** బీఆర్ఎస్ నేత, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెళ్లి పేరుతో ఓ యువతిని లైంగికంగా వేధించారంటూ ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. యూట్యూబ్ ఛానల్ పేరుతో ఓ ఫ్లాట్‌కు పిలిపించి తనను వేధించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, తన ప్రైవేటు ఫొటోలతో ఆయన బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ పేరుతో తన వద్ద రూ. 4 లక్షలు తీసుకుని మోసం చేశారని కూడా అందులో తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈనెల 26నే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## భారత్‌కు రానున్న చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్..!



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పర్యటించనున్నారు. ఈ సదస్సు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. అయితే, జిన్‌పింగ్ పర్యటనకు సంబంధించి ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన లేదా వివరాలు వెలువడలేదు. 2020 గల్వాన్ సరిహద్దు ఘర్షణల తర్వాత చైనా అధ్యక్షుడు భారత్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి కానుంది. జిన్‌పింగ్‌తో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

## పాకిస్తాన్‌లో పేలుడు.. 32 మంది దుర్మరణం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్తాన్‌లోని నైరుతి బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో గురువారం ఓ బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించింది. ఈ శక్తివంతమైన పేలుడులో కనీసం 32 మంది గని కార్మికులు మరణించారు. మరో 10 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. సహాయక బృందాలు గని లోపల రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి. ప్రాణాలతో ఉన్నవారిని కనుగొనే అవకాశాలు వేగంగా తగ్గిపోతున్నాయని అక్కడి అధికారులు తెలిపారు. పేలుడుకు గల కారణాన్ని నిర్ధారించడానికి అధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు.

